ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.09.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వాయుగుండం తీరం దాటినప్పటికి ఈరోజు, రేపు కుడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

2. భారీ వర్షాల దృష్ట్యా అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సహాయ కార్యక్రమాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

3. విద్యుత్, మంచినీటి సరఫరాకు, రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

4. భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ తో సహా పలు జిల్లాల్లో రేపు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

**<u>లీడ్ వర్షాలు</u>**

ఎడతెరపి లేని వర్షాలతో తెలంగాణ రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వాయుగుండం ప్రభావంతో ఈవేళ, రేపు కూడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాదా వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఈరోజు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు , రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు రెడ్ , అరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. కాగా, ఉత్తర బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం నిన్న అర్ధరాత్రి కళింగపట్నం ప్రాంతంలో తీరం దాటింది.

డెస్క్

**<u>వర్షాలు - సి ఎం</u>**

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. సీనియర్ మంత్రులు భట్టి , ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, జూపల్లి తదితరులతో ముఖ్యమంత్రి ఫోన్లో సమీక్ష జరిపి ఆదేశాలు జారీ చేశారు. సీఎస్, డీజీపీ, మున్సిపల్, విద్యుత్, పంచాయతీ రాజ్ , హైడ్రా, ఇరిగేషన్ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు , ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు 24 గంటలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అధికారులు సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని వెంటనే పనుల్లో చేరాలని ఆదేశించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంఓ కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు.

(SDP)

**<u>వర్షాలు- పొంగులేటి</u>**

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు , వరద పరిస్థితులపై రెవెన్యూ , విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిజిల్లా కలెక్టర్లు , డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖమ్మం. కొత్తగూడెం. వరంగల్. సూర్యాపేట. నల్గొండ. హైదరాబాద్ తదితర జిల్లాలో నెలకొన్న పరిస్థితులను అధికారులును ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలని , వరద ముప్పు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మారం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని , అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. రెస్క్యూటీమ్లు ,

ఎన్డీఆర్ఎఫ్. బృందాలు , అవసరమైతే రక్షణ చర్యలకు హెలికాప్టర్లు వినియోగించాలని ఆదేశించారు.

<u>బైట్</u>

విపత్తుల నిర్వహణ విభాగం అధికారులు సిబ్బంది 24 గంటల పాటు సచివాలయంలో అందుబాటులో ఉండాలని, విద్యుత్, తాగునీటికి, రాకపోకలకు అంతరాయాలు కలుగుకుండా చూడాలని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో నెలకొన్న పరిస్థితులను ఆ జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అక్కడ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

SDP

**<u>వర్షాలు- సి ఎస్</u>**

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు , వరదల నేపథ్యంలో చేపట్టిన సహాయ పునరావాస కార్యక్రమాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర సచివాలయం నుండి పర్యవేక్షిస్తున్నారు. జిహెచ్ఎంసి , పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు , జిల్లా కలెక్టర్లు, విపత్తు నిర్వహణ శాఖ అధికారులకు ఎప్పటికప్పుడు తగు సూచనలు అందజేస్తున్నారు.

(SDP)

**<u>వర్షాలు- హైదరాబాద్</u>**

హైదరాబాద్లో ఎడతెరిపి లేని వర్షాలతో జన జీవనం స్తంభించింది. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. నగరం లోని అనేక రహదారులు జలమయమయ్యాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను ఖమ్మం వైపు మళ్లించారు. మరికొన్ని వాహనాలను నార్కట్పల్లి , అద్దంకి వైపు మళ్లించారు. జీహెచ్ఎంసీ , హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్ , డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని

హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారి కోసం హైదరాబాద్లో 59 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వర్షాల నేపథ్యంలో హైదరాబాద్లో రేపు సోమవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ తెలిపారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను కోరారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితేనే బయటకి వెళ్లాలని జీహెచ్ఎసీ కమీషనర్ ఆమ్రపాలి తెలిపారు. మ్యాన్ హోల్స్ ను ప్రజలు తెరవకూడదని , తెరిచే పక్షంలో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ కు తెలపాలని కోరారు.

పిటిసి, హైదరాబాద్

**మూసీనది**

హైదరాబాద్ పరిసరాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీనదికి వరద ప్రభావం పెరిగింది. వలిగొండ మండలం సంగేం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జిని తాకు కూ మూసీనది ప్రవహిస్తోంది. దీంతో బ్రిడ్జికి ఇరువైపులా వాహనాలను పోలీసులు నిలిపివేశారు. బిబి నగర్ మండలం , రుద్రవెల్లి వద్ద కూడా మూసీ ఉప్పొంగుతోంది. మరోవైపు భారీ వర్షాల వల్ల పలు ప్రాజెక్టుల్లో వరద ఉధృతి పెరుగుతుంది. నాగార్జున సాగర్ లో 22 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వుదల చేస్తున్నారు.

డెస్క్

**వర్షాలు- భద్రాద్రి కొత్తగూడెం**

భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణం వరద ముంపునకు గురైంది. నిన్న ఉదయం నుంచి ఇప్పటి వరకు మణుగూరులో 316 మీమీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా కట్టవాగు , కోడిపుంజుల వాగు ఉధృతంగా ప్రవాహిస్తుండటంతో మణుగూరులోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన

రహదారిపై కూడా మోకాళ్ళ లోతు నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గర్భిణీ స్త్రీలు , వృద్ధులను పుట్టీల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే మరో 130 మంది ఆశ్రమ పాఠశాల విద్యార్థులను కూడా పునరావాస కేంద్రాలకు తరలించారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత మణుగూరులో మళ్లీ ఇంత భారీ వర్షం పడిందని స్థానికులు చెప్తున్నారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**వర్షాలు- జిల్లాలు**

నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఎక్కమేడు గ్రామంలో నిన్న రాత్రి వర్షానికి ఒక ఇల్లు కూలి నిద్రిస్తున్న తల్లి, కూతురు మృతి చెందారు.

మంచిర్యాల జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు హాజీపూర్ మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దానికి తోడు కడెం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండటంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం 20 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో భారీ వర్షం నమోదు అయింది. ఆసిఫాబాద్ , కాగజ్ నగర్ పట్టణాలలో రహదారులపై మోకాళ్ళ లోతు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల వాగులు ఉప్పొంగి రవాణాకు అంతరాయం కలిగింది. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన కొమరం భీమ్ ప్రాజెక్ట్ రెండు గేట్లు , వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లు పైకెత్తి 1560 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. కలెక్టరేట్ లో 6304686505 నెంబర్ తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణంలో పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కోదాడ నుంచి హుజూర్ నగర్ వెళ్లే రోడ్డుపై వరద నీటి ప్రవాహంలో రెండు కార్లు , ఒక బైకు కొట్టుకుపోయాయి. వాహనాల్లోని

ప్రయాణికులను పోలీసులు , స్థానికులు కలిసి రక్షించారు. కోదాడ లోని గాంధీనగర్ , ఆజాద్ నగర్, అంబేద్కర్ నగర్ కాలనీ, శ్రీరంగాపురం పెద్ద చెరువు పక్క గల కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. కోదాడ నుండి ఖమ్మం వెళ్లే రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఎలాంటి ఇబ్బంది వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు.

వరంగల్ జిల్లా వ్యాప్తంగా సగటున 151 మిల్లీ మీటర్ల అతి భారీ వర్షపాతం నమోదయింది. జిల్లాలో అత్యధికంగా పర్వతగిరి , నెక్కొండ మండలాలలో 294.8 మిల్లీ మీటర్లు ,246.4 మిల్లీ మీటర్లు అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. చెన్నారావుపేట, వర్ధన్నపేట, రాయపర్తి, వరంగల్ మండలాల్లో అతి భారీ వర్షాలు సంగెం , గీసుకొండ, దుగ్గొండి, నర్సంపేట, ఖానాపూర్, ఖిల్లా వరంగల్, నల్లబెల్లి మండలాలలో తేలికపాటి వర్షాలు నమోదు అయ్యాయి.

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏకదటిగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కరీంనగర్ కలెక్టరెట్ ముందు భారీగా నీరు నిలవడం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ - జగిత్యాల ప్రధాన రోడ్డు జలమయం అయింది. రెండు డిజస్టర్ మేనేజ్మెంట్ బృందాలను అందుబాటులో ఉంచారు.

భారీ వర్షాల కారణంగా జగిత్యాల జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని ధర్మసముద్రం చెరువు కట్ట దిగువ భాగంలో అమీనాబాద్ ఇండ్ల చుట్టూ వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు. జగిత్యాల పట్టణంలోని మెయిన్ రోడ్డు తో పాటు బైపాస్ రోడ్డు కాలువలలో వరద నీరు ప్రవహిస్తోంది. కడెం డ్యాం ప్రాజెక్టు నుండి పది గేట్లు ఎత్తిన కారణంగా ధర్మపురి వద్ద గోదావరిలోకి 79,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ధర్మపురిలో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాలతో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వాగులు , వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రైల్వే ట్రాక్ లపై వరద ప్రవహించడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు రైళ్ళను ఖమ్మం , మధిర రైల్వే స్టేషన్ లో నిలిపివేశారు. బోనకల్లు వద్ద రహదారిపై వరద ప్రవహించడంతో విజయవాడ ఖమ్మం బస్ సర్వీసులను నిలిపి వేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వరద సహాయక చర్యల పై ఖమ్మం కలెక్టరేట్ నుంచి అధికారులతో సమీక్షించారు. మధిర లో నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న విషయాన్ని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కరీంనగర్ పర్యటనను రద్దు చేసుకొని హుటాహుటిన గత అర్ధరాత్రి మధిరకు చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మధిర పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు వేల మంది లోతట్టు ప్రాంత ప్రజలను ఈ కేంద్రానికి తరలించారు.

జనగామ జిల్లాలో ఈరోజు 12 గంటల వరకు సగటున 107.2 మిల్లీమీటర్ల అతి భారీ వర్షపాతం నమోదయింది. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారిపై వరద నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లింగాల గణపురం మండలం పటేల్ గూడెంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలిక డైవర్షన్ రోడ్డు రాత్రి పూర్తిగా తెగిపోయింది. దీంతో జనగామ నుంచి పాలకుర్తికి వయా కుందారం మీదుగా వెళ్లాల్సిన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి శివారు రైల్వే ట్రాక్ పై వరద నీరు ప్రవహించడంతో రైల్వే ట్రాక్ క్రింద ఉన్న కంకర కొట్టుకు పోయింది. దీనితో మహబూబాబాద్, వరంగల్, డోర్నకల్ రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను నిలిపివేశారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో వరద నీరు పోటెత్తడంతో గ్రామంలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. 150 గొర్రెలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. మహబూబాబాద్ పట్టణంలో దాదాపుగా 20 నుంచి 30 కాలనీలలోని ఇండ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మహబూబాబాద్ కు రావలసిన ప్రధాన రహదారులన్నీ వరద నీరు చేరడంతో వాహన

రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోని ఆకేరు , మున్నేరు, పాలేరు,వట్టి, మద్ది, పాకాల వాగులు, వంకలు ఉధృతంగా పొంగిపొర్లుతున్నాయి.

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 24 గంటలకు పైగా ఏకధాటిగా కురిసిన వర్షాలకు జజనజీవనం స్తంభించి పోయింది... మొత్తం 33 మండలాలకు గాను 8 మండలాల్లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు.. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ఆయా ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు... వర్షం కారణంగా జిల్లా కలెక్టరేట్ తో పాటు రెవిన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ట్రాన్స్ కో, వ్యవసాయ శాఖల కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలం రాజిపేట గ్రామ పరిధిలోని పెద్దవాగు పొంగి పొర్లడంతో మూడు జాజి తండా , తిమ్మాపూర్ రామాలయ తండా గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. అక్కడక్కడ రోడ్లపై అడ్డంగా పడిన చెట్లను అధికారులు తొలగిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో నిన్నటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఉదయం 8:30 వరకు ఆందోల్ లో 98.2 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదయింది.

**<u>గంజాయి</u>**

వరంగల్ జిల్లాలో గంజాయి , మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణ పై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని , ఆ తర్వాత కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు.. గంజాయి ,ఇతర మత్తు పదార్థాలను విక్రయించే అనుమానస్పద ప్రాంతాలలో పటిష్ట నిఘా ఉంచి తరచూ పెట్రోలింగ్ చేయాలని డీసీపీ రవీందర్ కు సూచించారు. గంజాయి స్మగ్లింగ్ , గంజాయి వ్యసనానికి అలవాటు

పడుతున్న యువతి యువకుల సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 8712661111 కు కాల్ చేయాలని కలెక్టర్ కోరారు.

(PTC)

**<u>ఎలుకలు</u>**

నల్గొండ జిల్లా దేవరకొండ మండలం కొండ భీమనపల్లి లోని BC గురుకుల పాఠశాలలో రాత్రి పూట నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటనలో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారికి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేశారు... గురుకులంలో పారిశుధ్యం లోపించిన కారణంగా ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయని విద్యార్దులు ఆరోపిస్తున్నారు.

(PTC)